

# ఫ్చ్.. మిస్సయ్యాం!

**కల్కి కుమ్మేసింది.. అయినా నో హ్యాపీ!**
**పుష్ప-2 ఇరగదీసింది.. స్టిల్ ఏదో అసంతృప్తి!**
**2024లో ఇంటర్నేషనల్ లెవల్లో టాలీవుడ్ సత్తా చాటింది.**
**బట్.. లోకల్‌గా మాత్రం ఏదో వెలితి. రెండురెండ్ల నాలుగు..**
**ఇలా పర్‌ఫెక్ట్ ఈక్వేషన్‌తో ఎంట్రీ ఇచ్చిన 2024 కూడా**
**లోటుగానే ఫీలవుతున్నది! ఎందుకంటే.. మెగాస్టార్ టైమింగ్‌ను**
**చవిచూడలేకపోయానే అని బాధ! బాలయ్య బాబు తొడగొట్ట**
**కుండానే తనకు కాలం చెల్లిపోయిందని ఆవేదన! కాలానిదే**
**కాదు.. సగటు ప్రేక్షకుడి ఫీలింగ్ కూడా ఇదే!!**

తెలుగు సినిమా మూడో తరం ముచ్చట చిరంజీవి, బాలకృష్ణ. ఎనర్జీ లెవల్స్‌లో ఇద్దరూ ఇద్దరే! యాక్షన్‌లో ఒకరిని మించి మరొకరు రఫ్ఫాడించే బాపతు!! అడపాదడపా ఇంగ్లిష్ ఇయర్ ప్రారంభంలో వచ్చే సంక్రాంతికి ఇద్దరూ పోటాపోటీగా బరిలో దిగేవాళ్లు. ఎవరి సత్తా వాళ్లు చాటుకునేవాళ్లు. ప్రేక్షకులు పండుగ చేసుకునేవాళ్లు. 2023 సంక్రాంతికి కూడా 'వాల్తేరు వీరయ్య'గా చిరు అలరిస్తే, 'వీరసింహారెడ్డి'గా బాలయ్య బాబు రికార్డులు సృష్టించాడు. ఆ ఏడాది ఇద్దరూ చెరో రెండు సినిమాలు చేసి ప్రేక్షకులకు ఫీస్ట్ చేశారు. 'వాల్తేరు వీరయ్య'తో సూపర్ హిట్ తన ఖాతాలో వేసుకున్న మెగాస్టార్.. 'భోళా శంకర్'గా ప్రేక్షకులను పలకరించాడు. అయితే, 'భోళా..' భారీ పరాజయాన్ని మూటగట్టుకుంది. 'వీరసింహారెడ్డి'గా సంక్రాంతికి విజయం అందుకున్న బాలకృష్ణ 2023 ద్వితీయార్థంలో 'భగవంత్ కేసరి'గా మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. ఇలా ఇద్దరు పెద్ద హీరోలు రెండేసి సినిమాలు చేసి ఆ సంవత్సరాన్ని అపురూపంగా మార్చేశారు. ఎవరి దిష్టి తగిలిందో ఏమో కానీ, చిరు జోరుకు బ్రేకులు పడ్డాయి. మూడు నెలల్లో షూటింగ్ పూర్తిచేసే సంప్రదాయం పాటించే బాలకృష్ణ కూడా 2024పై శీతకన్ను వేశాడు. వారిద్దరి సినిమాలు ఈ ఏడాది సెట్స్‌కే పరిమితమయ్యాయి. దీంతో ఈ సంవత్సరం చిరు సందడి, బాలయ్య వీరంగం లేకుండా ప్రేక్షకులకు నిరాశే మిగిలింది.

**కాలం** విలువైనది. నిర్మాత మేలుకోరే నటులుగా పేరున్న చిరంజీవి, బాలకృష్ణకు ఇలా కాలాన్ని కర్పూరంలా కరిగించడం అస్సలు ఇష్టం ఉండదు. కానీ, అదే నిర్మాత క్షేమం కోసం, ఇండస్ట్రీ బాగు కోరి కాస్త లేట్‌గా అయినా లేటెస్ట్‌గా వద్దామని ఫిక్సయ్యారు. దాని ఫలితంగానే 2024లో ఈ ఇద్దరు హీరోల సినిమాలు ఒక్కటంటే ఒక్కటీ విడుదల కాలేదు. ఒక్కో సినిమా రెండేండ్ల పాటూ చిత్రీకరిస్తున్న ఈ రోజుల్లో ఏడాది గ్యాప్ రావడం పెద్ద విషయం కాదు. గతంలోనూ ఈ ఉభయ హీరోల సినిమాలు విడుదల కాని సంవత్సరాలు ఉన్నాయి. చిరంజీవి రాజకీయ రంగప్రవేశం తర్వాత దాదాపు తొమ్మిదేండ్లు సినిమాలకు దూరంగా ఉన్నాడు. రీ ఎంట్రీ తర్వాత వరుస ప్రాజెక్టులు ఒప్పుకోవడంతో.. మెగా అభిమానులు తెగ సంబురపడిపోయారు. అయితే, సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ బ్రేకులు ఇస్తుండటంతో పెదవి విరుస్తున్నారు.

### అడపాదడపా గ్యాప్‌లు..

2017లో 'ఖైదీ నెంబర్ 150'తో 'బాస్ ఈజ్ బ్యాక్' అనిపించుకున్నాడు చిరంజీవి. కానీ, ఆ మరుసటి ఏడాది ఆయన సినిమా ఒక్కటి కూడా విడుదల కాలేదు. మళ్లీ 2019లో 'సైరా నరసింహారెడ్డి'గా ప్రేక్షకులను అలరించాడు. హిట్ జాబితాలో చోటు దక్కించుకున్నా.. సగటు ప్రేక్షకులు మాత్రం ఈ చిత్రాన్ని అంతగా ఆదరించలేదనే చెప్పాలి. తర్వాత ఒకటి కాదు.. వరుసగా రెండేండ్లు మెగా అభిమానులకు నిరాశే ఎదురైంది. 2020, 2021లో చిరు సినిమా ఒక్కటీ విడుదల కాలేదు. ఈ గ్యాప్‌ను పూడుస్తూ 2022లో చిరంజీవి జంట సినిమాలతో అలరించాడు. 'ఆచార్య'లో అదిరిపోయే స్టెప్పులేసి చిరు ఆల్వేస్ మెగాస్టార్ అని నిరూపించాడు. అయితే, కొరటాల, చిరంజీవి, రామ్‌చరణ్ లాంటి భారీ కాంబోలో నిర్మించిన సినిమా కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వాటిని అందుకోలేక 'ఆచార్య' పరాజయం పాలైంది. ఈ సినిమా మిగిల్చిన చేదు అనుభవాన్ని అదే ఏడాది రిలీజైన 'గాడ్‌ఫాదర్' కొంతవరకు పూడ్చగలిగింది. హీరోయిన్ లేకుండా, పాటలు, స్టెప్పులు లేకుండా చిరంజీవి కంటిచూపుతో నడిపించిన చిత్రం 'గాడ్‌ఫాదర్'. ఈ సినిమా హిట్ ఇచ్చిన జోష్‌తో 2023లో మరో రెండు సినిమాలతో ప్రేక్షకులను పలకరించాడు చిరంజీవి. 'వాల్తేరు వీరయ్య' ఇండస్ట్రీ రికార్డులు తిరగరాసింది. అప్పుడెప్పుడో ఘరానా మొగుడు, రౌడీ అల్లుడు రేంజ్ మాస్ మసాలా పంచడంతో.. చిరు అభిమానుల్లో పూనకాలు లోడయ్యాయి. తర్వాతి సినిమా 'భోళా శంకర్' ఢమాల్ కావడంతో మెగాస్టార్ డైలమాలో పడ్డాడేమో.. ఆచి.. తూచి.. అడుగు వేయాలని ఫిక్సయ్యాడు. దీంతో 2024లో సెట్స్‌కే పరిమితమయ్యాడు. 'బింబిసార' ఫేమ్ మల్లాది వశిష్ఠ దర్శకత్వంలో చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర'.. ఈ ఏడాది శరవేగంగా షూటింగ్ జరుపుకొన్నది. 2025 సంక్రాంతికే విడుదల అవుతుందని అనుకున్నా.. ఇప్పటికైతే ఎలాంటి క్లారిటీ లేదు. కాకపోతే, వచ్చే ఏడాది చిరంజీవి మరో సినిమా కూడా విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని సమర్పణలో మెగాస్టార్ ఓ సినిమా ఓకే చేశాడు. ఇప్పటికింకా షూటింగ్ మొదలుకాకున్నా.. వచ్చే ఏడాదే ఇది రిలీజ్ అవుతుందని ఇండస్ట్రీ టాక్. మొత్తం మీద 2024లో ప్రేక్షకులను పలకరించని చిరు.. వచ్చే ఏడాది రెండు సినిమాలతో పండుగ చేస్తాడని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

**అక్కినేని వారూ అంతే..**

**సరైన** హిట్ పడక అక్కినేని హీరోలు కాస్త వెనుకంజలో ఉన్నారు. ఈ ఏడాది సంక్రాంతికి నాగార్జున నటించిన 'నా సామిరంగ' విడుదలైంది. అయితే, ఆశించిన విజయం సాధించలేకపోయింది. రొటీన్ ఫార్ములాకు భిన్నంగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నాగార్జున, ధనుష్ కాంబోలో రూపుదిద్దుకుంటున్న 'కుబేర' సినిమా డిసెంబర్ 31న విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇక నాగ్ తనయులు నాగ చైతన్య, అఖిల్ సినిమాలు కూడా ఈ ఏడాది బాక్సాఫీస్ ముందుకు రాలేదు. నాగ చైతన్య, సాయి పల్లవి కాంబోలో రూపుదిద్దుకున్న 'తండేల్' ఈ ఏడాదిలోనే రావాల్సింది. అయితే, ఆ సినిమా విడుదల వాయిదా పడుతూ వచ్చింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రిలీజ్ ఉంటుందని చిత్ర యూనిట్ ప్రకటించింది. మరోవైపు 2023లో 'ఏజెంట్'గా పలకరించిన అఖిల్ 2024లో వెండితెరకు ముఖం చాటేశాడు. 'ఏజెంట్' భారీ పరాజయాన్ని మూటగట్టుకోవడంతో ఆయనకు గ్యాప్ తీసుకోక తప్పింది కాదు. అఖిల్ తర్వాతి సినిమాపై ఇప్పటికైతే ఎలాంటి క్లారిటీ లేదు. వచ్చే సంవత్సరం ఏమవుతుందో చూడాలి.

### 2025 దబిడి దిబిడే..



బాలకృష్ణ కథ ఓకే అన్న తర్వాత గరిష్ఠంగా ఆరు నెలల్లో సినిమా విడుదల కావడం ఖాయం. కానీ, ఈ ఏడాది ఆ సంప్రదాయానికి మంగళం పాడాడు బాలయ్య. 2024లో ఆయన సినిమాలు రెండు సెట్స్ మీద సందడి చేసినా.. తెర మీదికి మాత్రం రాలేదు. 2014 నుంచి 2019 వరకు ఏటా కనీసం ఒక్కటైనా బాలయ్య సినిమా విడుదలైంది. 2019లో అయితే ఏకంగా మూడు సినిమాలు ప్రేక్షకులను అలరించాయి. ఎన్టీఆర్ జీవిత చరిత్ర ఆధారంగా నిర్మించిన 'కథానాయకుడు', 'మహానాయకుడు' చిత్రాలతో పాటు ఆ ఏడాది 'రూలర్'గా అభిమానులను అలరించాడు. 2020లో బాలకృష్ణ నటించిన ఒక్క సినిమా కూడా విడుదల కాలేదు. మళ్లీ 2021లో 'అఖండ' విజయం సొంతం చేసుకున్నా... 2022లో సెట్స్‌కే పరిమితమయ్యాడు. 2023లో జంట చిత్రాలతో హిట్లు సొంతం చేసుకున్నాడు. మళ్లీ 2024లో షూటింగ్ దశలోనే ఆగిపోయాడు. అయితే వచ్చే సంవత్సరం బాలకృష్ణ సినిమాలు రెండు, మూడు బాక్సాఫీస్ మీద దండయాత్ర చేయడం ఖాయంగా కనిపిస్తున్నది. బాబీ దర్శకత్వం వహించిన 'డాకూ మహారాజ్' రానున్న సంక్రాంతి రేసులో నిలిచింది. బోయపాటి కాంబోలో సిద్ధమవుతున్న 'అఖండ-2' కూడా 2025లోనే రిలీజ్ కానుంది. అన్నీ కలిసొస్తే మరో చిత్రం కూడా 2025లో సత్తా చాటుతుందని ఇండస్ట్రీ టాక్.

### మెగా డుమ్మా

చిరంజీవి మాత్రమే కాదు మెగా కాంపౌండ్ హీరోలు ఎవరూ 2024లో ప్రేక్షకులను పలకరించలేదు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ చేతి నిండా సినిమాలు ఉన్నా.. కారణాంతరాల వల్ల ఈ ఏడాది ఒక్క చిత్రమూ తెరపైకి రాలేదు. 'ఓజీ', 'హరిహర వీరమల్లు', 'ఉస్తాద్ భగత్ సింగ్' మూడు సినిమాల్లో ఆయన నటిస్తున్నాడు. రియల్ లైఫ్‌లో పాలిటిక్స్‌తో పవన్ బిజీగా మారడంతో ఆయన సినిమాలు ఈ ఏడాది ఒక్కటీ విడుదల కాలేదు. రామ్‌చరణ్ విషయానికి వస్తే.. 2022లో 'ఆర్ఆర్ఆర్', 'ఆచార్య' రెండు సినిమాలతో ప్రేక్షకులను పలకరించాడు. ట్రిపుల్ ఆర్‌తో పాన్ ఇండియా స్టార్ అయ్యాడు. గత రెండేండ్లుగా రామ్‌చరణ్ సినిమా సెట్స్‌లోనే చక్కర్లు కొడుతున్నది. శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'గేమ్‌ఛేంజర్' ఈ ఏడాదే విడుదల అవుతుందని అందరూ భావించారు. అయితే, కారణాంతరాల వల్ల 2025 సంక్రాంతికి రిలీజ్ అవుతున్నది. అన్నీ కుదిరితే వచ్చే ఏడాది రామ్‌చరణ్ రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రావొచ్చు. మెగా మేనల్లుడు సాయి దుర్గా తేజ్ సినిమా కూడా ఈ ఏడాది ఏదీ రిలీజ్ కాలేదు. ఇటీవలే ఆయన హీరోగా ఓ పాన్ ఇండియా సినిమా షూటింగ్ మొదలైంది. అనుకున్నట్టుగా జరిగితే వచ్చే ఏడాది మెగా హీరోలందరూ అభిమానులకు విజువల్ ఫీస్ట్ పంచుతారని ఆశించొచ్చు.

# జగన్నాటకం

**ఓటీటీ హిట్**

## హరికథ

**డిస్నీ+ హాట్‌స్టార్:** డిసెంబర్ 13
**తారాగణం:** రాజేంద్ర ప్రసాద్, శ్రీరామ్, అర్జున్ అంబటి, దివీ, పూజిత పొన్నాడ తదితరులు
**దర్శకత్వం:** మ్యాగీ

పురాణాలు.. ఇతిహాసాలు.. దుష్ట శిక్షణ-శిష్ట రక్షణ నేపథ్యంలో ఎన్నో సినిమాలు వచ్చాయి. శ్రీమహావిష్ణువు దశావతారాలు ఎత్తడం.. దుర్మార్గుల ఆట కట్టించడం.. లోకానికి మేలు చేయడం ఇతివృత్తంగా ఎన్నో కథలు వచ్చాయి. ఇప్పుడు వెబ్ సిరీస్‌లూ అదేబాట పడుతున్నాయి. దశావతారాల నేపథ్యంలో.. దుష్ట శిక్షణే లక్ష్యంగా డిస్నీ+ హాట్‌స్టార్‌లోకి వచ్చిన తెలుగు వెబ్ సిరీస్.. హరికథ.



1980 దశకం నేపథ్యంలో 'అరకు' పరిసర ప్రాంతాల్లో నడుస్తుందీ కథ. అక్కడ రంగాచారి (రాజేంద్ర ప్రసాద్) బృందం నాటకాలు వేస్తూ ఉంటుంది. దశావతార ఘట్టాలకు సంబంధించి ఒక్కోరోజు ఒక్కో నాటకాన్ని ప్రదర్శిస్తుంటుంది. అయితే.. రంగాచారి ఏ అవతారం గురించి నాటకాన్ని ప్రదర్శిస్తాడో.. ఆ అవతారం చేతిలో ఆ ఊరికి చెందిన ఒక్కో వ్యక్తి ప్రాణాలు కోల్పోతూ ఉంటాడు. అలా.. ఊరి వ్యక్తులు దారుణ హత్యలకు గురవుతుండటం.. అందరిలోనూ భయాన్ని కలిగిస్తుంది. ఒకనాడు నృసింహ అవతారం ఒకర్ని చంపుతుండగా.. ఒక వ్యక్తి చూస్తాడు. దాంతో, భగవంతుడే దుష్టులను శిక్షిస్తున్నాడంటూ జనంలో ప్రచారం మొదలవుతుంది. మరోవైపు.. విరాట్ (శ్రీరామ్), భరత్ (అర్జున్ అంబటి) ఇద్దరూ మంచి మిత్రులు. ఇద్దరూ పోలీస్ ఆఫీసర్లు. భార్యను కోల్పోయి, కూతురుతో కలిసి భరత్ దగ్గరికి వస్తాడు విరాట్. ఒకరోజు భరత్ కూడా హత్యకు గురికావడంతో.. ఆ హత్యతోపాటు అంతకుముందు జరిగిన హత్యల గురించీ ఆరా తీస్తాడు విరాట్. రంగాచారి వేస్తున్న నాటకాలకు.. ఈ హత్యలకు ఏదో సంబంధం ఉందని అనుమానిస్తాడు. అసలు రంగాచారి నేపథ్యం ఏమిటి? హత్యకు గురవుతున్న వాళ్లంతా అంతకుముందు ఏం చేశారు? అనే విషయాలు తెలియాలంటే.. 'హరికథ'ను వీక్షించాల్సిందే!



# ఆయన ఎప్పుడూ లేటే

**సెట్‌లోకి** ఆలస్యంగా రావడం.. శత్రుఘ్న సిన్హాకు ఓ అలవాటుగా ఉండేదని అలనాటి లెజెండరీ నటి షర్మిలా ఠాగూర్ గుర్తుచేసుకున్నది. తాజాగా, చిత్రసీమకు సంబంధించిన కొన్ని మరపురాని సంఘటనలను తన అభిమానులతో పంచుకున్నది. 1980లో వచ్చిన హిట్ సినిమా 'దోస్తానా' గురించీ, ఆ సినిమా షూటింగ్‌లో జరిగిన కొన్ని సంఘటనలనూ వివరించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ''దోస్తానా చిత్రంలో అమితాబ్ బచ్చన్ - శత్రుఘ్న సిన్హా కలిసి నటించారు. అయితే.. వీరిద్దరి సమయపాలన వేరువేరుగా ఉండేది. అమితాబ్ సమయానికి ముందే సెట్‌కు వచ్చేవారు. శత్రుఘ్న మాత్రం ఎప్పుడూ ఆలస్యమే! ఒకటి రెండుసార్లు కాదు.. నిత్యం అదే తంతు! ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు షెడ్యూల్ ఉండేది. అమితాబ్ షూటింగ్ ముగించుకొని ఇంటికి వెళ్లేటప్పుడు.. శత్రుఘ్న సెట్‌కు వచ్చేవారు. దాంతో.. ఇద్దరూ కలిసి నటించే సీన్స్ తీయడం.. డైరెక్టర్ రాజ్ ఖోస్లాకు తలనొప్పిగా మారేది. చాలా సీన్లలో డూప్‌తోనే నెట్టుకురావాల్సి వచ్చింది. షూటింగ్ విషయంలోనే కాదు.. అన్ని సందర్భాల్లోనూ ఆయనకు ఆలస్యం ఓ అలవాటుగా ఉండేది. ఎంతలా అంటే.. తన సొంత పెళ్లికి కూడా ఆయన ఆలస్యంగానే వచ్చారు. పార్లమెంటేరియన్‌గానూ పంక్చువాలిటీ పాటించలేదు!'' అంటూ శత్రుఘ్నపై సెటైర్లు వేసింది షర్మిలా! అయితే, శత్రుఘ్న సిన్హా సెట్‌లో చాలా సరదాగా ఉండేవాడనీ, తోటివారితో ఎంతో ప్రేమపూర్వకంగా మెలిగేవాడనీ.. మొత్తానికి ఆయన ఓ అద్భుతమైన వ్యక్తి అనీ కొనియాడింది. కానీ, సమయపాలన మాత్రం పాటించేవాడు కాదని చెప్పుకొచ్చింది.

# అయిష్టంగానే.. అబ్బాయిగా!

**ఎంతోమంది** ఆర్టిస్టులు బాలనటులుగా బాలీవుడ్‌లో అడుగుపెట్టారు. సహజమైన నటనతో మెప్పించి.. సక్సెస్ కొట్టారు. అలా.. బాలనటుడిగా ఒక తరానికి గుర్తుండిపోయిన నటి.. అహ్సాస్ చన్నా! పరిశ్రమలోకి అబ్బాయిగా అడుగుపెట్టి.. ఇప్పుడు హీరోయిన్‌గా రాణిస్తున్నది. అయితే, బాల్యంలో తాను బలవంతంగానే బాలుడి పాత్రలు వేసినట్లు తాజాగా చెప్పుకొచ్చింది.
ముంబయిలోని పంజాబీ సిక్కు కుటుంబంలో జన్మించిన అహ్సాస్ చన్నా.. ఐదేళ్ల వయసులోనే బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. 'వాస్తు శాస్త్రం' చిత్రంలో సుస్మితాసేన్ కొడుకు 'రోహన్'గా వెండితెరకు పరిచయమైంది. 2004లో విడుదలైన ఈ చిత్రానికి సెన్సేషనల్ డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహించారు. 2006లో కరణ్ జోహార్ దర్శకత్వం వహించిన హిట్ చిత్రం.. 'కభీ అల్విదా నా కెహనా'లోనూ షారుఖ్ ఖాన్ - ప్రీతి జింటా కొడుకు 'అర్జున్' పాత్రలో ఒదిగిపోయింది. ఈ సినిమా అహ్సాస్‌కు మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఆ తర్వాత 'మై ఫ్రెండ్ గణేశ్' చిత్రంలో వినాయకుడి స్నేహితుడు 'ఆశు'గా అలరించింది. ఇలా.. బాలనటిగా కంటే, బాల నటుడిగానే ప్రేక్షకులకు దగ్గరైంది అహ్సాస్ చన్నా. అయితే, తనకు ఏమాత్రం ఇష్టం లేకుండానే సినిమాల్లో అబ్బాయి పాత్రలు చేయాల్సి వచ్చిందని చెప్పుకొచ్చింది చన్నా! తాజాగా ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ విషయాలను వెల్లడించింది. తమ కుటుంబ సంప్రదాయంలో భాగంగా.. చిన్నతనంలో ఆమెకు గుండు చేయించారట. అప్పుడే 'వాస్తుశాస్త్రం' ఆడిషన్స్ పాల్గొన్నది చన్నా. ఆమె నటనకు ఫిదా అయిన సినిమా బృందం.. బాలనటుడి పాత్రకు ఎంపిక చేసింది. ఆ సినిమా హిట్ అవ్వడంతో.. చన్నాకు వరుస అవకాశాలు దక్కాయి. అయితే.. అవన్నీ అబ్బాయి పాత్రలే! దాంతో బాలీవుడ్ డిమాండ్ మేరకు.. తాను ఎప్పుడూ జుట్టు కత్తిరించుకొనే ఉండేదాన్ననీ, అబ్బాయిల్లానే డ్రెస్సింగ్ చేసుకునేదాన్ననీ వెల్లడించింది. ఈ విధానం తనను మానసికంగా చాలా ప్రభావితం చేసిందనీ చెప్పుకొచ్చింది. ''కభీ అల్విదా..' తర్వాత అబ్బాయి పాత్రలు మానేద్దామని అనుకున్నా.. మంచి అవకాశాలు రావడంతో కొనసాగించక తప్పలేద'ని ఆమె వాపోయింది. ప్రస్తుతం హీరోయిన్‌గా సినిమాలు, వెబ్ సిరీస్‌లు చేస్తూ బిజీగా మారిపోయిందీ భామ. ఇన్‌స్టాలోనూ అనేక బ్రాండ్లకు అంబాసిడర్‌గా పనిచేస్తున్నది.





# ఇలా సెర్చ్ చేయటం బాధించింది

**కష్ట** సమయాల్లో ఇష్టమైనవారి ప్రేమను పొందడమే అసలైన లగ్జరీ.. అంటున్నది బుల్లితెర నటి హీనా ఖాన్! అందానికి తగ్గ అభినయంతో.. టీవీ స్టార్‌గా ఎదిగింది హీనా! జెట్ వేగంతో దూసుకెళ్తున్న ఆమె కెరీర్‌కు.. 'క్యాన్సర్' సడెన్ బ్రేకులు వేసింది. ఈ ఏడాది ప్రారంభంలోనే తాను బ్రెస్ట్ క్యాన్సర్ బారినపడ్డట్టు చెప్పి.. అభిమానులను షాక్‌కు గురిచేసింది. ఒక పక్క కీమోథెరపీ చేయించుకుంటూనే.. అడపాదడపా కెరీర్‌కు సంబంధించిన ఈవెంట్లలోనూ మెరుస్తున్నది. ఇటీవలే.. గూగుల్‌లో అత్యధికంగా సెర్చ్ చేసిన టాప్-10 నటీనటుల జాబితాలోనూ చోటు దక్కించుకున్నది. అయితే, ఇది తనకు ఏమాత్రం గర్వించదగ్గ విషయం కాదనీ.. అనారోగ్య పరిస్థితుల వల్ల ఇలా గూగుల్ మోస్ట్ సెర్చ్‌లో ఉండే పరిస్థితి ఎవరికీ రావొద్దని కోరుకుంటున్నట్టు 'ఇన్‌స్టా'లో పోస్ట్ పెట్టింది. తానున్న ఈ క్లిష్ట పరిస్థితుల్లో.. తన వర్క్, తన విజయాల గురించి అభిమానులు వెతికి ఉంటే బాగుండేదని రాసుకొచ్చింది కూడా! తాజాగా, తన క్యాన్సర్ చికిత్స ప్రయాణాన్ని.. అందులో ఎదురవుతున్న సవాళ్లనూ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నది. కీమోథెరపీ వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలిసే ఫొటోను ఇన్‌స్టా పేజీలో షేర్ చేసింది. ఈ ఫొటో చూసిన ఆమె అభిమానులు.. కంటతడి ఎమోజీలతో తమ మద్దతు తెలుపుతున్నారు. కఠినమైన సవాళ్లు ఎదురవుతున్నా.. సానుకూలంగా స్పందిస్తూ సాగుతున్న హీనా ఖాన్ ప్రయాణం.. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నదని నెటిజన్లు కొనియాడుతున్నారు. 'ఏ రిశ్తా క్యా కహ్లాతా హై' ధారావాహికతో ఓవర్‌నైట్ స్టార్‌గా ఎదిగింది హీనా ఖాన్. ఆ తర్వాత హిందీ బిగ్‌బాస్‌లోనూ ఎంట్రీ ఇచ్చింది.